ఆహ్లాదం...ఆనందం...ఆరోగ్యం

- రూ.2 కోట్లతో పంచాయతీరాజ్ కాలనీలో పార్కు నేడు ప్రారంభం
- కార్యక్రమానికి హాజరుకానున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో మరో పార్కు ప్రజలకు అందుబాటులోకి రానుంది. నగరంలోని 46వ డివిజన్ పంచాయతీరాజ్ కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కు ప్రజలకు వినియోగంలోకి రానుంది. ఈ ప్రాంతంలోని మునిసిపల్ పార్కు స్థలం గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉండేది. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), పురపాలక పాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ప్రత్యేక కృషితో ఈ పార్కు అభివృద్ధి పనులకు బాటలు పడ్డాయి. ఈ ప్రాంతానికి చెందిన శ్రీలక్ష్మి తన తండ్రి యర్రా నాగేశ్వరరావు జ్ఞాపకార్థం రూ.5 లక్షలను పార్కు అభివృద్ధికి విరాళంగా ప్రకటించారు. దీంతో ఈ పార్కుకు యర్రా నాగేశ్వరరావు మునిసిపల్ కార్పొరేషన్ పార్కుగా నామకరణం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.2 కోట్లతో పార్కును రూపొందించి, బుధవారం ప్రారంభించనున్నారు.



ప్రారంభానికి ముస్తాబైన యర్రా నాగేశ్వరరావు పార్కు



పార్కు ముఖద్వారం(ఇన్‌సెట్‌లో)

పార్కులో విభాగాలు :
పార్కుకు వచ్చే సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచేందుకు పలు విభాగాలను ఏర్పాటు చేశారు. క్రికెట్ ఆడుకునేందుకు నెట్ ప్రాక్టీస్ విభాగం, పిల్లలు ఆడుకునేందుకు అధునాతన ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. శారీరక ఆరోగ్యానికి వాకింగ్ ట్రాక్, కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు లాన్ ఏర్పాటు చేశారు. మొక్కలు, పూల మొక్కలతో పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. కడియం నుంచి తెచ్చిన వివిధ రకాల క్రోటన్స్, ఆహ్లాదాన్ని పంచే పూల మొక్కలను నాటారు.

వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేయవచ్చు

- నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజ్యలక్ష్మి
- రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రాజ్యలక్ష్మి

పెడన: సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు వేసేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీ చేసిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.రాజ్యలక్ష్మి తెలిపారు. పెడన మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులతో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్ద పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనికి సంబంధించి దిశానిర్దేశం ఏమిటనే వివరాలను ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు త్వరలోనే తెలియజేస్తారని తెలిపారు. కదలలేని వృద్ధులు, వికలాంగులను బీఎల్‌వోలు గుర్తించడం లేదా దరఖాస్తు చేసుకుంటే వారి చిరునామా ప్రకారం విచారణ నిర్వహించి సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న వారికి పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పిస్తామని ఆమె తెలిపారు. పెడన నియోజకవర్గ వ్యాప్తంగా 216 బూత్‌లున్నాయని, 16 చోట్ల ర్యాంపులు లేవని, తొమ్మిది చోట్ల టాయ్‌లెట్స్ లేవని ఎన్నికల సంఘం పేర్కొనడంతో వీటిని యుద్ధప్రాతిపదికన నిర్మించడానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవం కార్యక్రమం జరుగుతుందని, యువ ఓటర్లకు ఓటరు ఐడీ కార్డుల పంపిణీతో పాటు సీనియర్ సిటిజన్స్ ఓటర్లను గౌరవించి సన్మానిస్తామన్నారు. వృద్ధులు, వికలాంగుల పోస్టల్ బ్యాలెట్ ఇంటివద్దే వేసుకునే అంశంపై లఘునాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బందారు మల్లి, కొండవీటి నాగబాబు, టీడీపీ నాయకులు శెలపాటి ప్రసాద్, శ్యామలరావు, జనసేన నాయకురాలు శివపావని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలాకృష్ణ, పెడన తహసీల్దారు పి.మధుసూదనరావు, ఎన్నికల డీటీ కల్పన పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- మండలంలో పేర్ని కిట్టు పర్యటన
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కోనేరుసెంటర్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు తెలిపారు. ఆయన మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. అనేక గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలు విన్నవించగా వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తొలుత బుద్దాలపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన రూ.15 లక్షల నిధులతో నూతనంగా వేయనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాలకాయలంకలో రూ.14 లక్షల జెడ్పీ నిధులతో ప్రారంభించనున్న పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మత్స్యకారులకు అవసరమైన రొయ్యల ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం పెదయాదర గ్రామంలోని ఎస్సీకాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, బుద్దాలపాలెం సర్పంచ్ ఎం.బాబూరావు, ఉపసర్పంచ్ అడపాల గోవర్ధనరావు, బ్యాంకు అధ్యక్షుడు కొప్పు ఉమామహేశ్వరరావు, అడపాల వీరబాబు, వాలిశెట్టి సోము, పెదయాదర కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ కంచర్లపల్లి విజయసారథి, గ్రామ ఇన్‌చార్జ్ అర్జా శంకర్, మాజీ ఎంపీటీసీ అర్జా రమణ, బ్యాంకు అధ్యక్షుడు అర్జా రాజారావు, మాజీ అధ్యక్షుడు అర్జా వెంకటేశ్వరరావు, మాలకాయలంకలో జరిగిన కార్యక్రమంలో వాడపాలెం సర్పంచ్ మేడిశెట్టి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఆరోగ్య భరోసా

- ఉప్పాల రాము
- భావదేవరపల్లిలో రెండో విడత ఆరోగ్య సురక్ష సేవలు
- వైద్య శిబిరంలో 354 మంది రోగులకు పరీక్షలు

గూడూరు: రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము అన్నారు. గూడూరులోని ఎంపీపీ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల వద్దకే కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. ఈ శిబిరాలలో వేలాది రూపాయల విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా చేయడమే కాకుండా మందులు కూడా ఉచితంగానే అందిస్తున్నామన్నారు. ఒక్క గూడూరులోనే 54 మందికి నేత్ర చికిత్సలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, సర్పంచి లింగం సులోచనారాణి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పర్లం పెదబాబు, గొరిపర్తి రవికుమార్, మల్లవోలు పీహెచ్‌సీ వైద్య బృందం పాల్గొన్నారు. శిబిరంలో మొత్తం 509 మందికి వైద్య పరీక్షలు, 35 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు.



భావదేవరపల్లిలో రోగులకు మందులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్యులు

భావదేవరపల్లి(నాగాయలంక): జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్)సేవలతో పేదలు, సామాన్య ప్రజలకు ఆరోగ్య సంపద చేకూరుతుందని వైస్ ఎంపీపీ, బీసీ నేత పరిశె అమ్మన్న, నాగాయలంక పీఏసీఎస్ అధ్యక్షుడు ఎంవీ సాంబశివరావు (చంటి)అన్నారు. ఇంటింటికీ ఉచితంగా వైద్య సేవలు చేరువ చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పేదల పట్ల నిబద్ధతను చాటుతుందన్నారు. మండలంలోని భావదేవరపల్లి సచివాలయం పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. వైద్య శిబిరంలో 354 మందికి పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందజేశారు. స్థానిక సర్పంచి మండలి ఉదయభాస్కర్, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు వైద్యాధికారులు డాక్టర్ వి.శివరామకృష్ణ, డాక్టర్ ఇంద్రకుమార్ రెడ్డి, డాక్టర్ శ్యామ్ ప్రసాద్, నేత్ర వైద్యురాలు ఎం.శ్రీలక్ష్మి, సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వైద్య,ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.



గూడూరులో జేఏఎస్ శిబిరంలో బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఉప్పాల రాము

సాలెంపాలెంలో 621 మందికి వైద్య పరీక్షలు
కోడూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం అందుతుందని, ప్రజలందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ అన్నారు. మండలంలోని సాలెంపాలెం సచివాలయ పరిధిలో మంగళవారం రెండవ విడత సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో జెడ్పీటీసీ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, 104, 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో కంటి, పిల్లల, జనరల్ వైద్య నిపుణులు మొత్తం 621 మందికి వైద్యసేవలందించారు. షుగర్, బీపీ పరీక్షలతో పాటు ఈసీజీలను కూడా తీశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, సచివాలయ, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దు

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము

పెడన: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఇప్పటి నుంచే ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. పెడన మండలం ఉప్పలకలువగుంట రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్‌లను, పంపింగ్‌స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించి సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, ఎప్పటి వరకు వచ్చేది, రానున్న వేసవిలో ఎటువంటి చర్యలు చేపట్టిందీ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దన్నారు. ఇప్పటికే మడక, నందమూరు గ్రామాలకు తాగునీరు పూర్తి స్థాయిలో అందడం లేదనే ఫిర్యాదులున్నాయని, ఎటువంటి చర్యలు చేపట్టాలో నివేదికలు ఇవ్వాల్సిందిగా సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డీఈ నటరాజ్, ఏఈ స్రవంతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, మాజీ ఎంపీపీ అచ్చుతరావు, దావు బైరవలింగం, వెంకట రామానాయుడు, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, ఎంపీటీసీలు ఉదయ్‌కుమార్, గిరిబాబు, ఉప్పలకలువగుంట సర్పంచ్ గుడిశేవ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉప్పలకలువగుంటలోని పంపింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న రాము, సంబంధిత శాఖ అధికారులు

ఆడుదాం ఆంధ్రా విజేతలకు బహుమతులు

పెడన: క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసి వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించేలా చర్యలు తీసుకున్నారని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయా ఆటలకు సంబంధించిన కిట్‌లను కౌన్సిలర్ కటకం ప్రసాద్, ఆడుదాం ఆంధ్ర పెడన నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఎస్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఫణి ధూర్జటితో కలిసి ఆమె అందజేశారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఫణిధూర్జటి మాట్లాడుతూ వాలీబాల్‌లో కాకర్లమూడి, కబడ్డీలో నందమూరు, క్రికెట్, బ్యాడ్మింటన్‌లో పెడన టౌన్ జట్లు మండల స్థాయి విజేతలుగా నిలిచాయన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీలు బుధవారం నుంచి పెడనలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు పల్లోటి స్కూలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బాబూలాల్, వైఎస్సార్ సీపీ నాయకుడు పరసా రాజేష్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, ఈవోపీఆర్డీ జయరామ్, సుందరం, క్రీడాకారులు పాల్గొన్నారు.



నందమూరు కబడ్డీ జట్టుకు కిట్‌లను అందజేస్తున్న ఎంపీపీ వాణి, ప్రత్యేక అధికారి ధూర్జటి తదితరులు

యువతలో దేశభక్తి స్ఫూర్తి నింపిన నేతాజీ

కోడూరు: జైహింద్ నినాదంతో యువతలో దేశభక్తి స్ఫూర్తిని రగిల్చిన ఆజాద్ హింద్ ఫౌజ్ దళపతి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని స్థానిక విద్యుత్ కార్యాలయం సమీపంలో మల్లంపాటి వంశీయుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద మంగళవారం నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జైహింద్ నినాదాలతో పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. డీటీ పద్మప్రియ, ఎంఈవోలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఆర్ఐ సుభాషిణి, ఏఓ పాండురంగారావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్ పాల్గొనగా, నిర్వాహకులు మల్లంపాటి సుదర్శన్, సత్యన్నారాయణ (బుజ్జి) పర్యవేక్షించారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి
మోపిదేవి: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి, ఉపాధ్యాయులు కె. రత్తయ్య, సురేష్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కోసూరు రామాంజనేయులు పాల్గొన్నారు.

నాగాయలంకలో ఘనంగా నేతాజీ జయంతి
నాగాయలంక: నేతాజీ యువజన సంఘం, సేవా సమితి ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య సమర యోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో పరాక్రమ్ దివస్‌గా జరిపారు. మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత దేశభక్తి పరాయణుడు బోసును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీటీసీ-1 సభ్యురాలు నాగిడి ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. లకనం నాగాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత మహిళానేత తలశిల స్వర్ణలత, ప్రజా సంఘాల నాయకుడు తలశిల లీలామనోహర్ తదితరులు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎదురుమొండి ఎంపీటీసీ సభ్యుడు మోకా నాగప్రసాద్, సాల్వేషన్ ఆర్మీ డీఓ టి.ప్రసాదరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, అగ్ని కుల క్షత్రియ నేత కర్రి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కోడూరులో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్ఐ, వివిధ శాఖల అధికారులు

లబ్ధిదారులకు నేరుగా ఫలాలు అందేలా పథకాలు

కోనేరుసెంటర్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనలో తీసుకొచ్చిన సంస్కరణల వలన ప్రజలకు నేరుగా ఫలాలు అందుతున్నాయని పలువురు వక్తలు అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం లోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అంశంపై విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా వక్తలు మాట్లాడారు. వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన మార్పులపై ఐఐఎం లక్నోకు చెందిన ఆచార్య సూర్యభూషణ్ దాస్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం ద్వారా ఎక్కువ మంది ఉపాధి పొందడానికి ప్రభుత్వం అనేక రకాల ప్రోత్సాహకాలను అందిస్తోందని చెప్పారు. రైతు భరోసా లాంటి కార్యక్రమం ఇందుకు చక్కటి ఉదాహరణ అన్నారు. సబ్సిడీపై పనిముట్లను అందించి వ్యవసాయ రంగంలో రైతులను ఆదుకుంటోందన్నారు.



మాట్లాడుతున్న సూర్య భూషణ్ దాస్

మహిళా సాధికారతపై వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి మాట్లాడుతూ మహిళల్లో ప్రశ్నించే తత్వం వచ్చిన నాడు సమాజంలో మరింత ఎదుగుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు సుందర కృష్ణ, డాక్టర్ ఎస్.ఉష, సహాయ ఆచార్యులు డాక్టర్ రామశేఖర్ రెడ్డి, పలువురు సహాయ ఆచార్యులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం



శిక్షణ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ రాజాబాబు, ఏఎస్పీ శ్రీహరిబాబు, డీఆర్వో రోజా

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సోమవారం రాత్రి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయగల నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఉచితాలు తదితర వాటిని నివారించేందుకు ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబుతో పాటు ఏఎస్పీ ఆర్.శ్రీహరిబాబు, డీఆర్వో పెద్ది రోజా, డీసీవో ఫణికుమార్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం సునీత, జిల్లా ప్రజారవాణాధికారి ఎ.భానుశ్రీ, ఇన్‌కంటాక్స్ అధికారి పీవీ రామచంద్ర, పోస్టల్ సూపరింటెండెంట్ ఆదినారాయణ, స్టేట్ ఆడిట్ అధికారి వై.సూర్యభాస్కరరావు, కమర్షియల్ టాక్స్ డెప్యూటీ కమిషనర్ కేపీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ చల్లపల్లికి విరాళం

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమానికి గ్రామానికి చెందిన బెజవాడ ప్రసాద్ - నాగలక్ష్మి దంపతులు రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్, రోశయ్య, రాజ్, శ్రీకాంత్, బెజవాడ జయమణి శంకర్, రేవంత్, మణిదీప్ పాల్గొన్నారు.

కూరగాయ పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

బొబ్బర్లంక(మోపిదేవి): కూరగాయ పంటల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన అధికారి ఎస్.రమేష్ సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించి కూరగాయ, మిర్చి తోటలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మిర్చిలో రసం పీల్చు పురుగుల వల్ల ఆకుముడత ఏర్పడి మొక్కలు గిడస బారుతున్నట్లు గుర్తించామన్నారు. దీని వల్ల పూత, కోత తగ్గిపోతుందని, వాటి నివారణకు శుద్ధి చేసిన విత్తనాన్ని వాడి ఆరోగ్యవంతమైన నారు నాటుకోవాలని సూచించారు. ఫిప్రోనిల్ గుళికలు నారుమడిలో వేసి తామర పురుగులు నివారించవచ్చన్నారు. ఫిప్రోనిల్ లీటరు నీటిలో 2 మిల్లీ లీటరు లేదా అసిటమిప్రిడ్ 0.3 గ్రాములను లీటరు నీటితో పిచికారీ చేసుకోవాలన్నారు. ఎండు తెగులు కూడా వ్యాపించినట్లు గుర్తించామని, దీని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ ద్రావణం 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్ల చుట్టూ తడపాలన్నారు. కాయకుళ్లు, కొమ్మ ఎండు తెగుళ్ల నివారణకు అజాక్సిస్ట్రోబిన్ ఒక మిల్లీ లీటరు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కాయ తొలుచు పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు ఒక లీటరు నీటిలో, ఫ్లు బెండిఅమైట్ 0.3 గ్రాముల ఒక లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని 21వ డివిజన్ బందరుకోట నగరపాలక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మంగళవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అధునాతన విధానాలను అమలు చేస్తూ విద్యాబోధన చేస్తున్న నేపథ్యంలో వాటిని అందిపుచ్చుకుని మంచి మార్కులు సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంకటేశ్వరరావు, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కార్పొరేటర్ మన్నే శారద, ప్రధానోపాధ్యాయుడు టీవీ రఘుకాంత్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక స్వావలంబన

కృత్తివెన్ను: ప్రభుత్వం ద్వారా సంక్రమించే సంక్షేమ పథకాల ద్వారా పేదలకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని, వారి ఆర్థిక పరిస్థితులపై సంక్షేమ పథకాలు మరింత ప్రభావాన్ని చూపుతాయని పలువురు వక్తలు అన్నారు. కృత్తివెన్నులో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభ నిర్వహించారు. యాత్ర వాహన జిల్లా కోఆర్డినేటర్ శ్రీరామచంద్రమూర్తి కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వాటి వల్ల ప్రజలకు కలిగే లబ్ధిని తెలియజేశారు. ముందుగా పోస్టర్ ఆవిష్కరణ, అనంతరం శాఖల వారీగా పథకాల నిర్వహణ, ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.రామతులసి, స్థానిక బీజేపీ నాయకులు పి.శ్రీనివాసరావు, ఏసురాజు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యులు సందీప్ పాల్గొన్నారు.

13,592 మంది కులగణన వివరాలు నమోదు

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలోని 16 సచివాలయాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాటికి 35.17 శాతం గృహాలలో 28.97 శాతం జనాభా కులగణన పూర్తి అయినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్ శ్రీనివాస్ చెప్పారు. మండల ఈఓపీఆర్‌డీ కె.అప్పల నరసమ్మ మంగళవారం మండలంలోని భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం, నంగేగడ్డ సచివాలయాల పరిధిలో కొనసాగుతున్న కులగణన పని తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో 17,055 గృహాలకు గాను ఇప్పటికి 5998 గృహాలలో 13592 మంది కుల గణన వివరాల నమోదు పూర్తయిందని ఆమె వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో 298 మంది ఎన్యూమరేటర్లు, 136 మంది సచివాలయ ఉద్యోగులు, ఐదుగురు వెరిఫికేషన్ అధికారులు, ఆరుగురు మండల స్థాయి పర్యవేక్షకులు ముమ్మరంగా కులగణన నిర్వహిస్తున్నారు. గ్రామ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు



మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వంతో అంగన్‌వాడీల చర్చలు సఫలీకృతం కావటంతో మంగళవారం నుంచి వారు విధుల్లో చేరారు. మచిలీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మచిలీపట్నం, గూడూరు, మచిలీపట్నం రూరల్ ప్రాంతాల్లోని 224 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధుల్లో చేరారు. వీరంతా నగరంలోని సీడీపీవో కార్యాలయానికి విచ్చేసి జాయినింగ్ రిపోర్టులను అధికారులకు అందజేశారు. కార్యకర్తలు, ఆయాలు జాయిన్ అయినట్లుగా అధికారులు ఇచ్చిన లెటర్లను ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులకు అందజేస్తున్నారు. బుధవారం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో నిర్వహించనున్నారు.

చిత్రలేఖనం పోటీలకు అనూహ్య స్పందన



మచిలీపట్నంటౌన్: స్థానిక పీఎం కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. పలు పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు. 9వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు ప్రశంసాపత్రాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ అందజేశారు. ఈ పోటీల్లో 1 నుంచి 5 స్థానాలను రాయేషా (కేంద్రీయ విద్యాలయం), జి.మౌనశ్రీ (కేంద్రీయ విద్యాలయం), స్వప్నశ్రీ (వేలేరు జేఎన్‌వీ), ఎస్.చరిత (కేంద్రీయ విద్యాలయం), ఎన్.లోహిత (పద్మావతి జూనియర్ కళాశాల) వరుసగా పొందారు.